# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :276 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 11-01-2025 | పేజీలు:4 వెల: 2.00

## ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడించిన ఆశా కార్యకర్తలు

హైదరాబాద్, జనవరి 10: రాష్ట్రంలో ఆశా వర్కర్లు ఉద్యమబాట పట్టారు. తెలంగాణ శాసనసభ సమావేశాల సందర్భంగా ఆశా కార్యకర్తల సమస్యలపై శాసనసభలో చర్చించాలని కోరుతూ.. ఈనెల జనవరి 10న ఎమ్మెల్యేల ఇండ్ల ముందు ధర్నాలు, చేపట్టాలని ఆశా యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. అందులో భాగంగా ఖమ్మం జిల్లాలో పిలుపునిచ్చారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయం ఆశా వర్కర్లు ధర్నా చేపట్టారు. ఆశాల పట్ల ప్రభుత్వ వైఖరి నశించాలంటూ నినాదాలు చేశారు. అలాగే వికారాబాద్ జిల్లా పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డిని ఇంటిని ముట్టడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. దీంతో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు, ఉద్యోగభద్రత కోసం పదిహేడేళ్లుగా పోరాడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. జాబ్‌చార్ట్ లేకుండా నిర్ణీత పనే కాకుండా సర్వేలకు, ఇతర పనులకు వినియోగిస్తూ శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# మెట్రో ప్రయాణికులకు గుడ్‌న్యూస్..మారనున్న మెట్రో ముఖచిత్రం



హైదరాబాద్,జనవరి 10 : గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ 158 కిలోమీటర్ల మేర ఉన్న ఔటర్‌ను అనుసంధానం చేస్తూ 36 వరకు రోడ్డు మార్గాలు, నాలుగు చోట్ల రైలు మార్గాలు ఉన్నాయి. రోడ్డు, రైలు మార్గాలతో పాటు మెట్రో మార్గం కలిస్తే భవిష్యత్ ప్రజా రవాణా వ్యవస్థ మెరుగ్గా ఉండే అవకాశాలున్నాయి. ఆ దిశగానే సీఎం రేవంత్ రెడ్డి ఉత్తర హైదరాబాద్ వైపు రెండు మెట్రో కారిడార్లు, దక్షిణ హైదరాబాద్ వైపు మరో కారిడార్‌కు డీపీఆర్‌లను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో మెట్రోరైలు సౌకర్యం ఔటర్ రింగు రోడ్డును దాటి నగర శివారు ప్రాంతాలకు అందుబాటులోకి రానుంది. హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టు మొదటి దశలోని జేబీఎస్ నుంచి ఎంబీజీఎస్ మార్గంలో 11 కిలోమీటర్లు ప్రస్తుతం నగరవాసులకు అందుబాటులో ఉంది. రెండో దశలో చేపట్టబోయే జేబీఎస–శామీర్‌పేట (22 కి.మీ), ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ), చాంద్రాయణ గుట్ట నుంచి ఇన్నర్ రింగు రోడ్డు మీదుగా ఆరాంఘర్, శంషాబాద్ టౌన్, శంషాబాద్ ఎయిర్‌పోర్టు లోపలి వరకు (35 కి.మీ), అదేవిధంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఫోర్త్ సిటీ(ఫ్యూచర్ సిటీ) వరకు (40 కి.మీ).. ఇలా మొత్తం 115 కిలోమీటర్ల మెట్రో మార్గం ఉత్తర దిక్కున ఉన్న శామీర్‌పేట ఔటర్ రింగు రోడ్డు నుంచి దక్షిణ దిక్కున ఉన్న ఫోర్త్ సిటీతో అనుసంధానం అవుతుంది. దీంతో గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ 158 కిలోమీటర్ల మేర ఉన్న ఔటర్ రింగు రోడ్డుకు ఉత్తరాన ఉన్న శామీర్‌పేట నుంచి సికింద్రాబాద్, ముషీరాబాద్, ఎంజీబీఎస్, చార్మినార్ మీదుగా చాంద్రాయణగుట్ట, శంషాబాద్ విమానాశ్రయం అక్కడి నుంచి ఫోర్త్ సిటీ వరకు మెగా మెట్రో కారిడార్ అవతరించనుంది. హైదరాబాద్ మహానగరంలో ఉత్తర–దక్షిణ దిక్కులను కలిపే మెగా మెట్రో కారిడార్‌లో ఎంజీబీఎస్, జేబీఎస్ వంటి బస్ స్టేషన్‌లు, ఎంఎంటీఎస్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు రాకపోకలు సాగించే సికింద్రాబాద్, ఫలక్‌నుమా, బుద్వేల్, శంషాబాద్, అల్వాల్, బొల్లారం వంటి రైల్వే స్టేషన్‌లతో అనుసంధానం అవుతుంది. ఇక అత్యంత కీలకమైంది శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం. భారతదేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా విమానాల నెట్‌వర్క్ కలిగిన విమానాశ్రయంతో కూడా ఈ మెట్రో కారిడార్ కలిస్తే అన్ని రకాల ప్రజా రవాణా వ్యవస్థలు ఒకే మార్గంలో ఉండనున్నాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్న ప్రాంతాలను కలపడమే కాకుండా నివాస, వ్యాపార వాణిజ్య కేంద్రాలను, ఔటర్ రింగు రోడ్డు ఇంటర్‌చేంజ్ కేంద్రాలను కలిపేలా మెగా మెట్రో మార్గం అందుబాటుకి వస్తే హైదరాబాద్ మహానగరంలో ప్రజా రవాణా వ్యవస్థ ముఖ చిత్రం సమూలంగా మారిపోనుంది.

# చంద్ర మండలానికి వెళ్లిన..భూమ్మిద ఎలా ఉండాలో తెలియటం లేదు



హైదరాబాద్,జనవరి 10:హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నామని, చంద్రమండలానికి వెళ్తున్నాం.. కానీ భూమిపైన ఎలా ఉండాలో మాత్రం తెలుసుకోలేకపోతున్నామని అన్నారు. సీఐఐ జాతీయ కౌన్సిల్ సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐఐ ప్రతినిధులతో ముఖ్యమంత్రి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. కాలుష్యకారక వాహనాలను అవుటర్ రింగ్ రోడ్డు అవతలికి తరలిస్తున్నామన్నారు. తెలంగాణలో స్వయం సహాయక సంఘాల్లో 67 లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారని, ప్రభుత్వ కార్యాలయాల్లో స్వయం సహాయక మహిళా సంఘాలతో క్యాంటీన్లు ఏర్పాటు చేయించామన్నారు. మహిళా సంఘాలతో సోలార్ పవర్ స్టేషన్లు ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్ ఉత్పత్తి చేసేలా మహిళా సంఘాలను ప్రోత్సహిస్తున్నామని, హైటెక్ సిటీ పక్కనే మహిళా సంఘాల ఉత్పత్తులను విక్రయించుకునేందుకు మూడున్నర ఎకరాల స్థలంలో స్టాల్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో చదువుకునే విద్యార్థులకు 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మొటిక్ ఛార్జీలను పెంచామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో మహిళాభివృద్ధి ధ్యేయంగా అడుగులు వేస్తున్నామని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గ్రామీణ మహిళల సాధికారత కోసం ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. తెలంగాణలో ఆటో మొబైల్ రంగంపై ప్రత్యేక దృష్టి సారించామని, మచిలీపట్నం పోర్ట్‌ను అనుసంధానం చేస్తు రోడ్లు రైలు మార్గాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. రీజనల్ రింగ్ రైల్వే లైన్ మంజూరు చేయాలని ప్రధాని మోదీని కోరామని చెప్పారు. చైనా తరహాలో క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని, అవుటర్ రింగ్ రోడ్డు, రీజనల్ రింగ్ రోడ్డు మధ్య రేడియల్ రోడ్లు నిర్మిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో ప్రతి యేడాది లక్షా పదివేల మంది ఇంజనీరింగ్ విద్యార్థులు ఉత్తీర్ణత సాధిస్తున్నారన్నారు. ఎక్కువ మంది విద్యార్థుల్లో స్కిల్ ఉండటం లేదని, టాటా గ్రూప్‌తో కలిసి 2400 కోట్లతో రాష్ట్రంలోని ఐటీఐలను ఐటీసీలుగా మారుస్తున్నామన్నారు. నైపుణ్యాల పెంపు కోసం ప్రత్యేకంగా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని, ఐఎస్ బీ తరహాలో స్కిల్ యూనివర్సిటీ కోసం ఆనంద్ మహీంద్రా చైర్మన్‌గా బోర్డు ఏర్పాటు చేశామని తెలిపారు. స్కిల్ యూనివర్సిటీ కార్పస్ ఫండ్ కోసం సీఐఐ ప్రతినిధులు మద్దతు ఇవ్వాలని, స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ హబ్ కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సీఐఐ ప్రతినిధులు ఎప్పుడైనా వచ్చి తనను కలవచ్చు.. తమ ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కాగా హైదరాబాద్‌లో ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీని నిర్మించాలని నిర్ణయించుకున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రపంచంలో హైదరాబాద్‌ను చైనాకు ప్లస్ సిటీగా మార్చే వ్యూహంతో ముందుకు వెళ్తున్నామని అన్నారు. న్యూయార్క్, లండన్, టోక్యో, సియోల్ , దుబాయ్ వంటి నగరాలతో ఫ్యూచర్ సిటీ పోటీ పడుతుందని వివరించారు. భారతదేశంలోనే గొప్ప నగరాన్ని నిర్మించాలని అనుకుంటున్నాం.. ఇందులో సేవారంగం మాత్రమే ఉంటుందని అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలకు రిజిస్ట్రేషన్, రోడ్డు పన్నును తొలగించామని ప్రకటించారు. ఫ్యూచర్ సిటీ కాలుష్య రహిత నెట్ జీరో సిటీగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. 3,200 ఈవీ బస్సులను ఆర్టీసీలోకి తీసుకువస్తున్నామని అన్నారు. భారతదేశంలోనే ఎలక్ట్రిక్ వాహనాలు అత్యంత వేగంగా తెలంగాణలో అమ్ముడవుతున్నాయని ముఖ్యమంత్రి వివరించారు.

# కేసీఆర్ కుటుంబాన్ని బీజేపీ వదిలిపెట్టదు..



హైదరాబాద్,కేటీఆర్ విచారణపై కేంద్రమంత్రి బండి సంజయ్ హాట్ కామెంట్స్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి కేసీఆర్ కుటుంబానికి ఏదో ఒప్పందం ఉందనిపిస్తోందని ఆరోపించారు.లొట్టపీసు ముఖ్యమంత్రి అని కేటీఆర్ మాట్లాడుతుంటే రేవంత్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉంటున్నాడని ప్రశ్నించారు. కేటీఆర్‌ని అరెస్ట్ చేస్తారో లేదో కూడా అనుమానమేనని తెలిపారు. ఫార్ములా ఈ రేస్‌లో రూ.700 కోట్లు లాభాలు వచ్చాయంటున్న కేటీఆర్.. అవి ఎక్కడున్నాయో కూడా చెప్పాలని నిలదీశారు.

బీఆర్ఎస్ కాంగ్రెస్ రెండు ఒక్కటే.. కావాలనే ఈ డ్రామాలు ఆడుతున్నాయని విమర్శించారు. కేసీఆర్ కుటుంబాన్ని బీజేపీ వదిలిపెట్టదు.. కచ్చితంగా వారి అవినీతిని బయటపెడుతామని అన్నారు. పొంగులేటి బాంబులు బాంబులు అన్నారు .. దీపావళి పోయింది, ముక్కోటి ఏకాదశి వెళ్లింది.. రేపు సంక్రాతి కూడా పోతుంది.. కానీ అవి పేలవని బండి సంజయ్ విమర్శించారు.మరోవైపు.. కరీంనగర్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేస్తామని బండి సంజయ్ తెలిపారు. అమృత్ భారత్ స్కీం ద్వారా ప్రధాని మోడీ 1300 రైల్వే పనులను పునరుద్ధరిస్తున్నారని అన్నారు. మార్చి లోపు కరీంనగర్ రైల్వే స్టేషనుని ప్రారంభించేలా ఆదేశాలు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. రూ.95 కోట్లతో కరీంనగర్ రైల్వే స్టేషను పనులు జరుగుతున్నాయి.. సకల సౌకర్యాలతో మోడల్ రైల్వే స్టేషనుగా రూపుదిద్దుతామని చెప్పారు. కరీంనగర్ ఆర్వోబీ పనులు అప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఆగిపోయాయి.. సేతుబంధు స్కీం ద్వారా కేంద్రప్రభుత్వం నిధులతో ఆర్వోబీ పనులు చేస్తున్నాం.. కేంద్రం వందశాతం పూర్తి నిధులు కేటాయించిందని బండి సంజయ్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేసే అభివృద్ధి పనులకి రాష్ట్ర ప్రభుత్వం సహకారం ఉండాలి.. భూసేకరణ చేయాల్సినది రాష్ట్ర ప్రభుత్వమేనని తెలిపారు. అంతేకాకుండా.. ఉప్పల్ ఆర్వోబీ పనులని ఆరు నెలలలో పూర్తి చేస్తామన్నారు. అలాగే.. 2027 లోపు కొత్తపల్లి–మనోహరాబాద్ పనులు పూర్తిచేయడానికి టార్గెట్ పెట్టుకున్నామని బండి సంజయ్ చెప్పారు.

# నా జన్మంతా పిఠాపురం ప్రజలకి రుణపడి ఉంటా..



అమరావతి,తనకు పని చేయడం తప్ప విజయం గురించి తెలియదని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. అటువంటి తనకు పిఠాపురం ప్రజలు ఘన విజయం ఇచ్చారని.. తన గాయాలకి పిఠాపురం ప్రజలు మందు వేశారని కొనియాడారు.జన్మంతా పిఠాపురం ప్రజలకి రుణపడి ఉంటానని తెలిపారు. నేడు పిఠాపురం పర్యటనలో భాగంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. "మీ బలం వలన రెండు లక్షల 8 కోట్లు పెట్టుబడులు వచ్చాయి. నా గెలుపు ఆంధ్ర ఆత్మ గౌరవం. రాష్ట్రంలో మౌళిక సదుపాయాలు అభివృద్ధి కావాలి. తిరుమలలో జరిగిన ఘటన బాధ కలిగించింది. సంక్రాంతి కి పిఠాపురంలో ఊరంతా పందిరి వేద్దాం అనుకున్నాను.. కానీ తిరుమల ఘటనతో తగ్గించి చేస్తున్నాను. కుదిరితే దసరా బాగా చేసుకుందాం." అని డిప్యూటీ సీఎం తెలిపారు."ఓట్లు కోసం బుగ్గలు నిమరడం, తల కాయలు నిమరడం కాదు. మీరు పిఠాపురం గెలిపించిన వ్యక్తి గిరిజనులకి రోడ్లు వేయించడానికి పని చేస్తున్నాడు. మనసు మానవ సహజం..రాజకీయాల్లో ఎవరు పెట్టుకోరు. అన్నమయ్య జిల్లాలో గత ప్రభుత్వంలో ఉన్న నాయకులు దాడి చేశారు. ఏపీ ప్రభుత్వం జీతాలుతో బతికిన కుటుంబం నాది.. ఆ రుణం తీర్చుకోవాలి. మా నాన్న మీద దాడి జరిగితే ఎలా స్పందిస్తారో అలా స్పందించాను. 414 గ్రామాలు ప్రజలు డోలిలతో అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వం వేల కోట్లు దుర్వినియోగం చేసింది. ఓట్లు కోసం కాదు.. నాకు లెక్కలు లేవు." అని పవన్ కీలక వ్యాఖ్యలు చేశారు.అనంతరం పవన్ కళ్యాణ్ గుర్రం జాషువా కవిత చదివి వినిపించారు. గత ప్రభుత్వాన్నీ నడిపిన పెద్ద మనుషులకు ఈ ఆరు నెలలు పాలన పట్ల తృప్తి లేదట.. గత ప్రభుత్వం డైరీలను చంపేశారని తెలిపారు. ఏడీబీ రోడ్డును గత ప్రభుత్వం ఐదేళ్లు వదిలేసిందని.. గత ప్రభుత్వం స్కామ్‌లలో రికార్డు సృష్టించిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం అభివృద్ధిలో రికార్డు సృష్టించిందని వెల్లడించారు.

## నేటి నుంచి సంక్రాంతి సెలవులు...

హైదరాబాద్, జనవరి 10 : తెలంగాణలో సంక్రాంతి పండుగ హడావుడి మొదలైంది. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. ఎందుకంటే రేపట్నుంచి స్కూళ్లకు సంక్రాంతి సెలవులు కాబట్టి. స్కూల్ విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబై పాఠశాలలకు వెళ్లారు. రాష్ట్రంలోని అన్ని రకాల పాఠశాలలకు జనవరి 11 నుంచి 17 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించారు. 18వ తేదీన పాఠశాలలు తిరిగి తెరుచుకోనున్నాయి. ఇక జూనియర్ కాలేజీలకు జనవరి 11 నుంచి 16 వరకు సెలవులు ప్రకటించారు. 17న పునఃప్రారంభం కానున్నాయి. సెలవు దినాల్లో ఎట్టి పరిస్థితుల్లో కూడా తరగతులు నిర్వహించకూడదని ఇంటర్మీడియట్ బోర్డు ప్రయివేటు కాలేజీల యాజమాన్యాలను హెచ్చరించింది. ఇంటర్ బోర్డు నిబంధనలు ఉల్లంఘించిన కాలేజీలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# సీఎం రేవంత్, మంత్రి కోమటిరెడ్డిపై ప్రివిలేజ్ మోషన్ పెడుతాం..



హైదరాబాద్ : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సినిమాటోగ్రఫి మంత్రి కోమటిరెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. గేమ్ ఛేంజర్ సినిమాకు టికెట్ల రేట్ల పెంపుదల విషయంలో సీఎం, మంత్రిని హరీశ్‌రావు తప్పుబట్టారు. అసెంబ్లీ సాక్షిగా చేసిన ప్రకటనను రేవంత్ సర్కార్ తుంగలో తొక్కిందంటూ మాజీ మంత్రి నిప్పులు చెరిగారు.పుష్ప–2 మూవీ విడుదల సందర్భంగా తొక్కిసలాట జరిగి ఒక మహిళ మృతి చెందారు, ఇక మీదట సినిమాలకు స్పెషల్ ప్రివిలేజ్ ఇచ్చేది లేదంటూ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెండు వారాలు కూడా తిరగకముందే ఊసరవెల్లి సైతం సిగ్గుపడేలా మాట మార్చారు అని హరీశ్‌రావు విమర్శించారు. టికెట్ రేట్లు పెంచేది లేదంటూ అదే అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన మరో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాటలు సైతం స్వల్ప వ్యవధిలోనే నీటి మూటలు అయ్యాయని హరీశ్‌రావు పేర్కొన్నారు.


అసెంబ్లీలో ప్రకటించిన దానికే విలువ లేకపోతే ఎట్లా ? అసెంబ్లీని కూడా తప్పుదోవ పట్టిస్తూ టికెట్ రేట్లు, అదనపు షోలకు అనుమతి ఇవ్వడం సభను అవమానించడమే. అసెంబ్లీని తప్పుదోవ పట్టించినందుకు ముఖ్యమంత్రిపై, మంత్రిపై సభా హక్కుల ఉల్లంఘన కింద ప్రివిలేజ్ మోషన్ పెడతాం అని హరీశ్‌రావు తెలిపారు.మాట తప్పం, మడమ తిప్పం అంటూ బీరాలు పలికి ఇప్పుడు టికెట్ రేట్ల పెంపునకు ఎలా అనుమతి ఇచ్చారు? ఎవరికి లబ్ధి చేకూర్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు? గతంలో మీరు బెనిఫిట్ షోలకు, టికెట్ రేట్ల పెంపునకు అనుమతి ఇవ్వడం వల్లే ఒక మహిళ మృతి చెందారు, మరో పసివాడు ఇంకా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ పాపం మీ ప్రభుత్వానిదే కదా రేవంత్ రెడ్డి. ఆ దురదృష్ట ఘటనను మరిచిపోకముందే ఎందుకు ఈ యూ టర్న్? దీని వెనుక ఉన్న మర్మం ఏమిటి? అని సీఎం రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు ప్రశ్నించారు.

# తొకకిసలాట బాధితులకు వైకుంఠ దర్శనం



తిరుమల,జనవరి10: తిరుపతి తొక్కిసలాట బాధితులకు టిటిడి అధికారులు శ్రీవారి ప్రత్యేక దర్శనం కల్పించారు . సీఎం ఆదేశాల మేరకు క్షతగాత్రులకు టీటీడీ వైకుంఠ ద్వార దర్శనం చేయించింది. తొక్కిసలాటలో గాయపడి.. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన వారందరికీ ఈ అవకాశం కల్పించారు. తొక్కిసలాట బాధితులతోపాటు వాళ్ల కుటుంబసభ్యులకు కూడా వైకుంఠ ద్వార దర్శనం చేయించింది. మొత్తం 52మందికి వైకుంఠ ద్వార ప్రత్యేక దర్శనం కల్పించారు. సీఎం చంద్రబాబు, మంత్రుల పరామర్శ సమయంలో తిరుపతి తొక్కిసలాట బాధితులు ఇదే కోరుకున్నారు. తమకు వైకుంఠ ద్వార దర్శనం చేయించి.. ఇంటికి పంపాలని విజ్ఞప్తి చేశారు. దీంతో వారికి ఆ వెసులుబాటు కల్పించారు. క్షతగాత్రులు కోరిన మేరకు మొత్తం 52మందికి టీటీడీ అధికారులు ప్రత్యేక దర్శనం చేయించారు. తిరుపతి స్విమ్స్‌లో ఇంకా 16మంది తొక్కిసలాట బాధితులకు చికిత్స కొనసాగుతోంది. క్షతగాత్రుల్లో ముగ్గురికి తీవ్ర గాయాలు అయినట్లు తెలుస్తోంది. డిశ్చార్జ్ అయిన 33మందికి 2లక్షల రూపాయల చొప్పున పరిహారం కూడా అంజేయ నున్నారు. బాధితులను ఇంటికి చేర్చే బాధ్యతను కూడా ప్రభుత్వమే తీసుకుంది. మరోవైపు తిరుపతి తొక్కిసలాటలో మరణించిన భక్తుల మృతదేహాలను వాళ్లవాళ్ల స్వస్థలాలకు తరలిస్తున్నారు. పోస్టుమార్టం తర్వాత డెడ్‌బాడీస్‌ను కుటుంబసభ్యులకు అప్పగించారు. తిరుపతి తొక్కిసలాటలో ఉమ్మడి విశాఖకి చెందిన నలుగురు మృత్యువాత పడ్డారు. నలుగురిలో లావణ్య, శాంతి, రజనీది విశాఖకాగా.. నాయుడుబాబుది నర్సీపట్నం. నలుగురి మృతదేహాలనూ.. వాళ్ల స్వగృహాలకు తరలించారు. మృతదేహాలు చూసి కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. కాగా తిరుమలలో శుక్రవారం టీటీడీ పాలక మండలి అత్యవసర సమావేశం కానుంది. తొక్కిసలాట మృతుల కుటుంబాలకు పరిహారంపై తీర్మానం చేయనుంది. సాయంత్రానికి పరిహారం చెక్కులు అందించే యోచనలో ఉంది టీటీడీ బోర్డు. వైకుంఠ దర్శనాలు మూడురోజులకే పరిమితం చేయాలా.. మిగిలిన వారం రోజులకు టికెట్లు ఇవ్వాలా? అన్న అంశంపై అత్యవసర సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు.

# 'ఇండియా' బ్లాక్ శాశ్వతం.. కేవలం ఎన్నికల్లో పోటీ కోసం కాదు



శ్రీనగర్: ప్రతిపక్షాల కూటమి 'ఇండియా' బ్లాక్ శాశ్వతమని జమ్ముకశ్మీర్ మాజీ సీఎం, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా అన్నారు. ఈ కూటమి కేవలం ఎన్నికల్లో పోటీ చేయడం కోసమే కాదని తెలిపారు. దేశాన్ని బలోపేతం చేయడం, ద్వేషాన్ని తొలగించడం కోసమని చెప్పారు. 'ఇండియా' బ్లాక్‌లో భాగమైన ఆప్, కాంగ్రెస్ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పరస్పరం తలపడుతున్నాయి. ఈ కూటమికి చెందిన టీఎంసీ, శివసేన (యూబీటీ) వంటి పార్టీలు ఆప్‌కు మద్దతు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో 'ఇండియా' కూటమి ఐక్యత, మనుగడపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కేవలం లోక్‌సభ ఎన్నికల కోసమే అయితే ఈ కూటమిని ముగించవచ్చని ఫరూక్ అబ్దుల్లా కుమారుడు, జమ్ముకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా గురువారం సూచించారు.కాగా, ఈ పరిణామాల నేపథ్యంలో 'ఇండియా' కూటమి భవిష్యత్తు గురించి మీడియా అడిగిన ప్రశ్నకు ఫరూక్ అబ్దుల్లా సమాధానమిచ్చారు. ఈ కూటమి కేవలం ఎన్నికల్లో పోటీ చేయడం కోసం కాదని తెలిపారు.

## సంపాదకీయం

శనివారం 11-01-2025

# విశాఖ సాక్షిగా ప్రధాని మరోసారి ద్రోహం

దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల 8న రాష్ట్ర ఆర్థిక రాజధాని విశాఖ వచ్చి వెళ్లారు. భారీ బహిరంగ సభలో మాట్లాడారు. ఆయన ప్రసంగంలో రాష్ట్రాన్ని వేధిస్తున్న సమస్యలపై స్పందించక పోవడం తీవ్ర నిరాశకు గురి చేసింది. ఈ ప్రాంతం, ఆంధ్ర రాష్ట్ర ప్రజలు గత నాలుగేళ్లుగా పోరాడుతున్న విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ మాట మాత్రం కనీసంగా కూడా ఎత్తలేదు. పక్కనే ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కనీసంగా కూడా అడగలేదు. సరికదా, ఆయనను ప్రసన్నం చేసుకోవడానికే ఇద్దరూ పోటీ పడ్డారు. ముచ్చటగా ముగ్గురూ కలిసి ఈ సభా వేదికగా ఆంధ్ర రాష్ట్రానికి మోసం చేశారు. సభంతా ఒకర్నొకరు పొగుడుకోవడంతోనే సరిపోయింది. ఆయన సభలో పదేపదే ప్రస్తావించిన గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు నిర్మాణం, ఆయన విధానపరంగానే ద్వేషించే, ఒక ప్రభుత్వ రంగ పరిశ్రమ అయిన ఎన్‌టిపిసి ద్వారా జరగడం ప్రభుత్వ రంగ ప్రాముఖ్యత తెలుస్తోంది. సరిగ్గా రెండేళ్ల క్రితం ఇదే 2022 నవంబర్ 12వ తేదీన ఇదే ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్‌లో ఆయన సభ జరిపారు. అప్పటికే స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమం సాగుతోంది. అప్పుడు కూడా ఆయన దానిపై స్పందించలేదు. ఆయన పక్కనే ఉన్న నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కూడా ఆయనను అడగలేదు. దీనిపై నాడు ప్రతిపక్షంలో ఉన్న నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్-ఇద్దరూ జగన్మోహన్ రెడ్డి తనపై ఉన్న కేసుల గురించి భయపడి మోడీని అడగలేదని విమర్శించారు. ఆ విమర్శ కూడా సహేతుకమైనదే కావచ్చు. అయితే విచిత్రంగా నేడు అదే మోడీ పక్కన కూర్చున్న చంద్రబాబు నాయుడు గానీ, పవన్ కల్యాణ్ గానీ మోడీని కనీసం మాట వరసకైనా అడగలేకపోవడం ఆశ్చర్యం కలిగించడమే కాక సమర్థనీయం కూడా కాదు. ఎందుకంటే, వీరు 2024 ఎన్నికలకు ముందు రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఏర్పడితే విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షిస్తామని, రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో ముందుకు తీసుకు పోతామని హామీ ఇచ్చారు. కానీ అందుకు భిన్నంగా కేంద్రం స్టీల్‌ప్లాంట్ కష్టాలను మరింత పెంచింది. కార్మికులను తొలగిస్తోంది. ఉద్యోగుల జీతాలు కూడా చెల్లించకుండా తిప్పలు పెడుతోంది. బొగ్గు, ముడి సరుకు, రైలు ర్యాకులు కూడా ఇవ్వకుండా స్టీల్ ప్లాంట్‌ను అష్ట దిగ్బంధనం చేస్తోంది. ఈ దుస్థితి నుండి ఈ సభలోనైనా ఉపశమనం కలుగుతుందేమోనని కొంతమందైనా ఆశించారు. కానీ ఆ ఆశలను అడియాసలు చేస్తూ, ప్రధాన మంత్రి తమ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోలేదు. సరికదా, పక్కలో బల్లెంలా రాష్ట్ర ప్రభుత్వం దీనికి సమీపంలోనే అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ప్రైవేట్ రంగంలో మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని ప్రకటించడమే గాక దానికి అనుసంధానంగా పోర్టు నిర్మిస్తామని కూడా తెలిపారు. వీటికి మించి, ఇటీవల చంద్రబాబు నాయుడు దేశ రాజధాని ఢిల్లీలో ప్రధానమంత్రిని కలిసినప్పుడు విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయించాలని అడగలేదు. కానీ ప్రైవేట్ రంగంలోని ఇంకా స్థాపించబడని మిట్టల్ స్టీల్ ప్లాంటుకు మాత్రం గనులు ఇవ్వాలని కోరారు. దీన్నిబట్టి తెలుస్తోంది ఈ డబుల్ ఇంజన్ సర్కార్ పయనమేటో! అందులో భాగస్వామ్య పక్షాలకు విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ మీద ఎంత చిత్తశుద్ధి ఉందో! రక్షణ కాదు, భక్షణ వీరి విధానము.దీనికి తోడు, రాష్ట్ర విభజన తరువాత జరిగిన 2014 ఎన్నికలలో విశాఖపట్నం కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటు చేస్తామని అప్పటి మిత్రులైన నరేంద్ర మోడీ, చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. పదేళ్ళ గడిచినా నేటికీ అతీ గతీ లేదు. నాయకుల ప్రకటనలే తప్ప ఆచరణలో రైల్వే జోన్ ఏర్పాటు కాలేదు. నేడు దీనిపైనా పదేళ్ల తరువాత శంకుస్థాపన చేశారు. ఇక ప్రారంభానికి ఎంత సమయం వేచి ఉండాలో! కానీ ఆ పేరున, వందేళ్లకు పైగా చరిత్ర కలిగి, దేశంలోనే రైల్వేకు అతి పెద్ద ఆదాయం సమకూరుస్తున్న డివిజనల్లో ఒకటిగా ఉన్న విశాఖపట్నం రైల్వే డివిజన్‌ను ఎత్తివేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇది పచ్చి దగా తప్ప మరొకటి కాదు. పదేళ్ళ నుండి ఊరిస్తూ, ఊరిస్తూ ఎట్టకేలకు రైల్వే జోన్‌కు శంకుస్థాపన చేయడంలో గర్వపడవలసినదేముంది? పదేళ్ళ క్రితం రావలసిన ఇంత ఆలస్యం చేసినందుకా?ఈ వైఖరిని ఎండగట్టి, రాష్ట్ర హక్కులను సాధించుకోవడంలో ముఖ్యమంత్రి క్రియాశూన్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రశ్నిస్తానని బయల్దేరిన పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రి అయ్యాక ఆ ప్రశ్న అనే పదాన్నే మరిచిపోయారు. దీనితో నరేంద్ర మోడీ ప్రభుత్వం కేంద్రంలో మెజార్టీ లేకపోయినా, మరింత రెచ్చిపోయి రాష్ట్రానికి ద్రోహం చేస్తోంది. ప్రత్యేక హోదా మాటే మరిచింది. వివిధ విద్యా సంస్థల నిర్మాణ పనులు ఇంకా నత్తనడకన సాగుతున్నాయి. విశాఖ, విజయవాడ మెట్రో రైల్ ఊసే కేంద్ర ప్రభుత్వం మరిచింది. కడప ఉక్కు ఫ్యాక్టరీ, దుగ్గరాజపట్నం పోర్టు సాధ్యం కాదని కేంద్ర ప్రభుత్వం తేలుస్తేసింది. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు రావలసిన ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీలను కేంద్ర ప్రభుత్వం ఒక ప్రహసనంలా మార్చేసింది. వీటిపై కూడా కూటమి నేతలు నోరు మెదపడం లేదు.నేడు పాలకులు ప్రజలు కోరుకున్నవి కాకుండా ప్రజల ఆలోచనలలో లేనివి ప్రకటించి అదే అభివృద్ధి అని నమ్మబలుకుతున్నారు. ఈ సభలో మోడీ అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో బల్క్ డ్రగ్ ప్లాంట్ ఏర్పాటుకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. విశేషమేమిటంటే అక్కడ ప్రజలు స్థానికులు ఈ ప్లాంట్ మాకొద్దు బాబోయ్, దీనివల్ల ఇప్పటికే కాలుష్యంతో సతమత మవుతున్న మా ప్రాంతం, సముద్ర తీరం మరింత కలుషితం అవుతుంది, మత్స్యకారులకు ఉపాధి పోతుంది అని మొత్తుకుంటున్నారు. అయినా ఇదే అభివృద్ధి అంటూ కేంద్ర, రాష్ట్ర పాలకులు బలవంతంగా రుద్దుతున్నారు. అచ్యుతాపురం దగ్గర పూడి వున్న గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు కూడా వర్చువల్‌గా ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. అక్కడ కూడా 1200 ఎకరాల భూమిని కోల్పోయిన స్థానిక రైతులు, నిర్వాసితులు ఉపాధి, నష్ట పరిహారం గురించి ఇంకా వేచి చూస్తున్నారు.సి.ఎం చంద్రబాబు నాయుడు ఇటీవల శ్రీకాకుళం జిల్లా పర్యటనలో కూడా అక్కడ ప్రజలు కోరుకుంటున్న నీటి ప్రాజెక్టు నిర్మాణం, కిడ్నీ వ్యాధి పరిశోధన కేంద్రం, భావనపాడు ఫిషింగ్ హార్బర్ వంటివి కాకుండా ఎయిర్ పోర్టు, కార్గో ఎయిర్ పోర్టు నిర్మాణం చేస్తామని తెలిపి, పెద్ద ఎత్తున బలవంతపు భూ సేకరణకు పూనుకుంటున్నారు. ఈ ప్రాంత ప్రజల నెత్తిపై కుంపటిలా కొవ్వాడ అణు విద్యుత్ ప్లాంట్ అన్నది ఎలాగూ ఉంది. ఆ ప్రమాదం గుర్తించే ఆలోచనే కనీసంగా కూడా రాష్ట్ర ప్రభుత్వానికి లేకపోవడం శోచనీయమే.రాష్ట్రంలోని గంగవరం పోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న 10.39 శాతం వాటాను జగన్ ప్రభుత్వం అదాని సంస్థకు అమ్మేసింది. దీనితో 2852 ఎకరాల భూమితో సహా సర్వ హక్కులు ప్రభుత్వం అదానీ పరం చేసింది. విశాఖ ఏజెన్సీ ఏరియాలో వివిధ ప్రాజెక్టుల పేరుతో గిరిజన ఉపాధికి గండికొడుతూ, గిరిజన చట్టాలను అతిక్రమించి, అదాని సంస్థకు అనుమతులు ఇచ్చింది. విశాఖ నగరంలో అత్యంత విలువైన 130 ఎకరాల భూమిని అదానీ డేటా సెంటరుకు అప్పజెప్పింది. నేడు అదాని కంపెనీలు అత్యంత అవినీతికి పాల్పడి విద్యుత్ ఒప్పందాలు చేసుకున్నట్లు అమెరికా కోర్టుల్లో కేసు నడుస్తోంది.

# మునక మునుగోడుతో మొదలైందా?



హైదరాబాద్,బిజెపి మాతృక 'భారతీయ జనసంఘ్' కార్యవర్గ సమావేశం, నేటికి యాభైయేడు ఏళ్ల కిందటే (1967) ఒక చరిత్రాత్మక సందేశాన్నిచ్చింది. 'పార్టీలో కొత్తవారి చేరిక, ఇతర పార్టీలతో కలిసి ఉమ్మడి ప్రభుత్వాలు ఏర్పాటు చేయటం వంటివి జరిగినపుడు పార్టీలో కొత్తగా చేరేవారు, పాత నాయకుల మధ్య ఓ సంఘర్షణ, సమస్యలు తలెత్తడం ఉంటుంది. దాన్ని సంయమనంతో అధిగమించాలి' అని నిర్ణయించింది. అదే సందర్భంలో పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ మాట్లాడుతూ, 'అస్పృశ్యత నేరం, రాజకీయ అస్పృశ్యత అతిపెద్ద నేరం' అన్నారు. 'అటువంటి కలయికలు తప్పదు, అప్పుడు అందరూ కలిసి పని చేయాల్సిందే' అని వివరణా త్మకంగా ఆయన ఉద్బోధించారు. కొంచెం సర్దుబాట్లతోనయినా.. ఇదే విధానాన్ని పార్టీ నాయకత్వం ఇప్పటికీ దేశవ్యాప్తంగా అనుసరిస్తోంది. కానీ, ఆ విషయంలో వివాదమే తెలంగాణ బిజెపి విస్తరణలో తీవ్ర ప్రతిష్టంభనకు కారణమవుతోంది. ఈ సమస్యను అధిగమించలేక పార్టీ ఢిల్లీ నాయకత్వం అయోమయానికి గురవుతూ, తలపట్టుకుంటోంది. సమస్యలు సరే%ా% పరిష్కారాలు కావాలి!తెలంగాణలో బిజెపి పరిస్థితి బయటివారికే కాక అంతర్గతంగా పార్టీ శ్రేణులకూ విస్మయం కలిగిస్తోంది.ఎదిగే అవకాశం ఉండీ, విస్తరణలో వీడని ప్రతిష్టంభన ఏర్పడింది. ఓ పట్టాన తొలగటం లేదు. పార్టీ రాష్ట్ర కొత్త అధ్యక్ష నియామకమే జరగట్లేదు. సంస్థాగత ఎన్నికలకు దాన్ని ముడిపెట్టి ప్రస్తుతానికి సరిపెట్టారు. పాత కొత్త నాయకుల మధ్య ఘర్షణ వైఖరితో%ా% రాష్ట్రంలో సంస్థాగత ఎదుగుదల ఒకడుగు ముందుకి రెండడుగులు వెనక్కి పడుతోంది. బిజెపి ఎదుగుదలను వేరెవరో కాదు, పార్టీ సొంత నాయకత్వమే అడ్డుకుంటున్నట్టుందని వారి హితైషులు, శ్రేయోభిలాషులే సనుక్కుంటున్నారు. పార్టీ ఢిల్లీ నాయకత్వపు ద్వైదీభావం కూడా పార్టీ శ్రేణుల్నే ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఒకే విషయంలో రెండు విధాలుగా%ా% అంటే, ఒకసారి ఒకలా, మరోసారి ఇంకోలా వ్యవహరించడం వెనుక లాజిక్కేమిటో ఎవరికీ అంతుబట్టడంలేదు. పాత కొత్త నాయకుల మధ్య సయోధ్య కుదుర్చకుండా, మరో పక్క%ా% పార్టీ నేతలతో ఏ సంప్రదింపులు లేకుండా, మాటమాత్రంగానైనా చెప్పకుండా కొత్త వారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న తీరు వింతగా ఉంటోంది. లాంఛనంగా పార్టీలోకైనా రాకముందే బయటి వారికి పదవులు కట్టబెట్టడం చూస్తుంటే%ా% ఢిల్లీ స్థానిక నాయకత్వం మధ్య సయోధ్య ఎంత గొప్పగా ఉందో ఇట్టే అర్థమవుతోంది. తెలంగాణ బిసి నాయకుడు ఆర్.కృష్ణయ్య కు ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపి(రాజ్యసభ) స్థానం కట్టబెట్టడంలో అదే జరిగింది.వామపక్షవాదిగా ముద్రపడ్డ ప్రొ. నాగేశ్వర్‌ను బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా కలుస్తారు. కానీ ప్రయత్నం మీద కూడా పార్టీ సానుభూతిపరులైన పారిశ్రామికవేత్తలు, సామాజిక కార్యకర్తలు ఒకోసారి కలువలేని పరిస్థితులుంటాయి. ఆర్.కృష్ణయ్య రాజకీయ నేపథ్యం చిత్రంగా ఉంటుంది. 2014లో తెలుగుదేశం తెలంగాణ సిఎం అభ్యర్థిగా ప్రచారం పొంది, ఎల్‌బి నగర్ నుంచి ఎంఎల్‌ఏగా గెలిచారు. తర్వాత అయిదేళ్లు ఏనాడు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనలేదని, పార్టీ కార్యాలయానికీ వచ్చేవారు కాదని టిడిపి వారే అంటారు. 2018 కాంగ్రెస్ అభ్యర్థిగా మిర్యాలగూడ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఆయన కాంగ్రెస్‌లో ఉన్న సంగతి అప్పట్లో చాలా మంది కాంగ్రెస్ వారికే తెలియదు. ఇక 2022లో వైఎస్‌ఆర్‌సిపి తరపున ఎపి నుంచి రాజ్యసభకు కృష్ణయ్య ఎంపిగా ఎన్నికయ్యారు. 2024 ఎన్నికల్లో ఆ పార్టీ ఓటమి తర్వాత ఎంపి పదవికి ఆయన రాజీనామా చేశారు. అంతర్గతంగా ఏం జరిగిందో ఎవరికీ తెలియదు, ఉన్నట్టుండి బిజెపి తరపున, ఎపి నుంచి తిరిగి రాజ్యసభకు ఎన్నికయారు. టిడిపిజనసేనలతో బిజెపికి అక్కడ పొత్తుండటం వల్ల వారికో ఎంపి స్థానం లభించింది. కానీ, ఎంపి అయ్యాక ఆయనను పిలిచి పార్టీ సత్కరించడమో, ఆయనే స్వయంగా పార్టీ కార్యాలయానికి (ఎపిలోగాని, తెలంగాణలో గానీ) వచ్చి కృతజ్ఞతలు చెప్పడమో%ా% వంటి మర్యాదలేవీ జరుగలేదని బిజెపివాదులే వాపోతుంటారు. పైగా, కర్కోటకుడు, కరడుగట్టిన నేరస్థుడు నయీమ్‌ను మెచ్చుకోవడమే కాక, తనకు రూ. 200 కోట్లు ఇస్తానన్నాడని, తనని పార్టీ పెట్టమన్నాడనీ కృష్ణయ్య చెప్పారు. అతని వల్ల ఓట్లు వచ్చాయా? వైఎస్‌ఆర్‌సిపియే ప్రకటించుకున్నట్టు ఆర్.కృష్ణయ్యకు ఎంపి సీటివ్వడం వల్ల బిసిలంతా ఆ పార్టీ వైపు మొగ్గి ఉంటే, అసెంబ్లీ ఎన్నికల్లో వారికి అంతటి దయనీయ ఫలితాలు (11/175) ఎందుకు వస్తాయనే లాజిక్ ను బిజెపి కేంద్ర నాయకులు ఆలోచించారో, లేదో? తెలియదు. అమలుపరిచే వరకు కేంద్ర నాయకత్వ ఆలోచన ఎపి బిజెపి నాయకులకు తెలిసినట్టు లేదు. తెలంగాణలో పార్టీని గెలిపిస్తే బిసి ముఖ్యమంత్రిని చేస్తామని ప్రజలకు చెప్పి, కారణాలే చెప్పాపెట్టకుండా, ఎన్నికల ముందు ఉన్నట్టుండి బిసి రాష్ట్రాధ్యక్షుడు బండి సంజయ్‌ను ఎందుకు తప్పించారో అన్నది మాత్రం ఎవరికీ తెలియదు.తెలంగాణ బిజెపిలో ఎన్ని సొబగులు ఉన్నా నాయకుల మధ్య సయోధ్య లేదు. ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులకు, చాన్నాళ్లుగా బిజెపిలో ఉన్న పాత తరానికీ మధ్య స్పర్థ ఉంది. ఎన్నికైన ఎంఎల్ఏలు, ఎంపిల మధ్య, వారిలో వారికి కూడా పెద్దగా సఖ్యత లేదంటారు. జంట నగరాల ఏకైక ఎంఎల్ఏ రాజాసింగ్ 'తానొక దుర్గం, తనదొక మార్గం' అన్నట్టు విడిగానే వ్యవహరిస్తారు.ఎంపిలు ఈటల రాజేందర్, డి.అర్వింద్, డి.కె. అరుణ, మాజీ ఎంఎల్‌సి రాంచంద్రరావులలో పార్టీ రాష్ట్ర అధ్యక్షపీఠం ఎవరికి దక్కుతుందనే చర్చ నిరంతరాయంగా సాగుతూనే ఉంది. పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో దాదాపు 35 వేల బూత్ కమిటీలకు గాను 22వేల కమిటీలు ఏర్పడ్డాయి, మిగతావి ఏర్పడుతున్నాయి. మండల కమిటీల ఏర్పాటు పూర్తయింది. జిల్లా కమిటీలు ఏర్పడాల్సి ఉంది. రాష్ట్ర కమిటీకి ఎన్నికలు నిర్వహిస్తారా? ఢిల్లీ నాయకత్వమే నియమిస్తుందా? తేలాల్సిన అంశం. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ను తిరిగి అధ్యక్షుడు కావాలని ఉందని, అందుకే ఆయన పరోక్షంగా సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేసుకుంటున్నారని పార్టీలోనే ప్రత్యర్థులైన వారు ఢిల్లీ వరకు మోశారు.అది తెలిసి ఢిల్లీ నేతలు ఆగ్రహంగా ఉన్నారనే సమాచారంతోనే 'రాష్ట్రాధ్యక్ష పదవికి నేను పోటీలో లేను' అని బండి స్వయంగా మీడియా ద్వారా ప్రకటన ఇచ్చుకోవాల్సి వచ్చిందనే ప్రచారముంది. పార్టీ నాయకుల మధ్య సఖ్యత లోపించడం వల్లే ఎన్నికల ముందు అత్యవసరంగా నాయకత్వాన్ని మార్చాల్సి వచ్చిందని స్వయంగా ప్రధాని ఒక ఆంతరంగిక సమాచారంలో వెల్లడించే వరకు, ఆ మార్పు ఎందుకు జరిగిందనేది మిస్టరీయే! అప్పట్లో ఆయన జరిపిన పాదయాత్ర (నాలుగు విడతల)ను అధికారికంగా ముగించలేదు. ఎందుకు అనుమతించారో? ఎందుకు ఆపేయమన్నారో..? హేతుబద్ధంగా ఎందుకు ముగించలేదో కూడా ఎవరికీ తెలియదు. వివాదాస్పదమైన 'పుష్ప' వ్యవహారంలోహీరో అర్జున్‌ను నెత్తిన పెట్టుకొని, అవసరానికి మించి రాష్ట్రనాయకత్వం స్పందించిన తీరుకు అధిష్టానం అనుమతి ఉందా? అన్నది పార్టీ శ్రేణుల్లోనే సందేహం!


### ఒక్క తప్పుతో పతనం

పాలక బిఆర్‌ఎస్ నుంచి ఈటల రాజేందర్ బిజెపిలోకి వచ్చి, హుజూరాబాద్ ఉప ఎన్నిక గెలిచే వరకు శ్రేణుల్లోనే కాక పార్టీలోనూ మంచి ఊపు ఉండింది. సాధారణ ఎన్నికల్లో హుజూరాబాద్ గజ్వేల్ రెండు చోట్ల నుంచి ఆయన ఓడిపోయినా%ా%. మల్కాజిగిరి నుంచి లోక్‌సభకు గెలవటంతో మళ్లీ ఊపొచ్చింది. కానీ, తానాశించిన రాష్ట్రాధ్యక్ష పదవికి పార్టీలోని పాతతరం నుంచి ప్రతిఘటన ఎదురవడంతో మళ్లీ డీలాపడ్డారు. దుబ్బాక అసెంబ్లీ ఉప ఎన్నిక, హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికల్లో మెరుగైన స్థితి, హుజూ రాబాద్ ఉప ఎన్నిక, తర్వాతి వరంగల్ తదితర కార్పొరేషన్ ఎన్నికలు%ా%. ఇలా ఒకటి తర్వాత ఒకటిగా బిజెపి గెలుపు బాటలో సాగుతున్న తరుణంలో మునుగోడు అసెంబ్లీ ఉపఎన్నిక ముంచుకు వచ్చింది. 'వచ్చింది' అనే కంటే 'తెచ్చుకున్నారు' అనడమే సబబేమో! సరైన అధ్యయనం, తగిన అంచనా లేకుండా చేజేతులా కొని తెచ్చుకున్న 'తొందరపాటు చర్య'లా, బిజెపిని నిలువునా ముంచిన ఉపఎన్నిక అది! వరుసగా మూడు ఎన్నికల్లో పార్టీ ఓడుతున్న స్థానమది. 2014లో టిడిపితో పొత్తుల్లో పార్టీ నాయకుడు మనోహర్ రెడ్డి పోటీ చేసి ఓడిపోయారు. కాంగ్రెస్ నాయకుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పార్టీలో చేరకముందే ఆయనని అభ్యర్థిగా ప్రకటించి, నియోజక వర్గంలో, ఎన్నికల సభలో కండువా కప్పారు. కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ కూడా దక్కని ఆ ఎన్నికలో.. పాలకపక్షం చేతిలో ఓటమి బిజెపికి పెద్ద షాక్! అప్పటివరకున్న ఊపు తుస్సుమంది. బిజెపిలో చేరాలా కాంగ్రెస్‌లోనా%ా% అని అప్పటిదాకా ఊగిసలాటలో ఉన్న పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు వంటి ఎందరో నాయకులు, ఈ ఫలితంతో బిజెపి పై ఆశలు వదులుకొని కాంగ్రెస్‌లో చేరిపోయారు. చివరకు మునుగోడు బిజెపి అభ్యర్థి రాజగోపాల్ రెడ్డి కూడా కాంగ్రెస్‌లోకే వెనక్కి వెళ్లిపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా తటస్థ ఓటర్లు కూడా అటే మొగ్గడంతో మునుగోడు చేదు అనుభవపు ప్రతికూల ప్రభావం, 2023 అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లోనూ బిజెపి అవకాశాలను తుడిపేసింది. ఒక రకంగా రాష్ట్రంలో బిజెపి పతనానికి మునుగోడు ఓటమి నాందీ వాచకమైంది.

### అయోమయంలో అధిష్టానం

అధికారంలోకి వస్తామనుకున్న తెలంగాణలో పరిణామాలు, ముఖ్యంగా సంస్థాగత అంశాలు బిజెపి అధిష్టానానికి మింగుడుపడటం లేదు. పార్టీ ఎంఎల్‌ఎలు, ఎంపిలతో ఇటీవల భేటీ అయిన ప్రధాని మందలించింది ఇందుకే! విషయాలన్నీ తెలుస్తున్నా%ా% ఏమీ చేయలేని అచేతన స్థితి! పార్టీ నాయకుల మధ్య నెలకొన్న అనారోగ్యకర స్పర్థకు ఆర్‌ఎస్‌ఎస్ స్థానిక నాయకత్వమూ విసిగిపోయినట్టు సమాచారం. వాస్తవ పరిస్థితుల్ని అర్థం చేసుకోకపోవడం, దీన్‌దయాల్ ఉపాధ్యాయ చెప్పినట్టు 'పాత -కొత్త నాయకులు కలిసి నడవాల్సిందే' అనే వాస్తవికతను జీర్ణించుకోకపోవడమే కారణమన్న భావన ఉంది. కేంద్రంలో అధికారం ఉండి, ఆర్థిక వనరులకూ కొదువలేక, ఎనిమిదేసి మంది ఎంపిలు-, ఎంఎల్‌ఎల బలముండి%ా% ప్రజాక్షేత్రంలో ముందడుగు పడటం లేదు. అందు కే, పార్టీ కేంద్ర నాయకత్వం అయోమయంలోపడి తలపట్టుకుంటోంది. ఏం చేస్తున్నామో తెలియని స్థితికి వారి నిర్ణయాలే నిదర్శనం!.

# రైతుల పోరాటం ఉధృతం...



హైదరాబాద్,కాలగర్భంలో కలిసిపోయిన 2024 సంవత్సరం మరో రైతు పోరాటానికి తెరతీసింది. గత ఏడాది ఫిబ్రవరి 14 నుంచి పంజాబ్ రైతులు హర్యానా సరిహద్దుల్లోని శంభు-అంబాలా, అఖౌరీ-జింద్ కూడళ్ల వద్ద బైఠాయింపు జరుపుతున్నారు. మరో నెల రోజుల్లో ఈ బైఠాయింపు ఏడాది పూర్తి చేసుకుంటుంది. ఈ పోరాటం 2020-21లో ఢిల్లీ శివార్లలో జరిగిన సుదీర్ఘ బైఠాయింపును అనివార్యంగా గుర్తు చేస్తున్నది. పైగా అప్పుడు మూడు నల్ల వ్యవసాయ చట్టాలను వెనుకకు తీసుకునే సందర్భంలో కేంద్ర పభుత్వం చేసిన వాగ్దానాలను నెరవేర్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు.ముఖ్యంగా కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, రైతుల ఆత్మహత్యలకు కారణమవుతున్న పంట రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని కోరుతున్నారు. అంతిమంగా ఢిల్లీని మరోసారి చుట్టుముట్టి ఆందోళనను ఉధృతం చేయాలనేది పంజాబ్ రైతుల ఆలోచన. ఒక పోరాటానికి లొంగిపోయిన సర్కారు ఇచ్చిన హామీల అమలుకు మరో పోరాటం చేయాల్సి రావడం విడ్డూరం. అంతేకాకుండా ఉపసంహరించుకున్న చట్టాల్లోని రైతు వ్యతిరేక అంశాలనే మార్కెటింగ్ ఫ్రేమ్‌వర్క్ పేరిట మరో రూపంలో తీసుకురావడానికి కేందం ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే.ఓ వైపు సరిహద్దుల్లో బైఠాయింపు కొనసాగుతున్న నేపథ్యంలో రైతుల డిమాండ్ల కోసం ప్రముఖ రైతు నాయకుడు జగ్జీత్‌సింగ్ ధల్లీవాల్ ఆమరణ నిరాహార దీక్ష మొదలుపెట్టడంతో పోరాటం కొత్త మలుపు తిరిగింది. ఆ దీక్ష 40 పైచిలుకు రోజులుగా ఖనౌరీలో సాగుతున్నది. గతంలో నాలుగుసార్లు నిరాహార దీక్ష చేసినప్పటికీ ఈసారి గమ్యాన్ని సాధించడమే లక్ష్యంగా ఆమరణం చేపట్టడం, అది సుదీర్ఘంగా సాగుతుండటం దేశవ్యాప్తంగా, ముఖ్యంగా రైతాంగంలో ఆందోళన కలిగిస్తున్నది.సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని సూచించినా వారితో చర్చలకు ముందుకు రాకపోవడం కేంద్ర ప్రభుత్వానికి రైతుల పట్ల గల ధోరణికి అద్దం పడుతున్నది. గత డిసెంబర్‌లో ధల్లీవాల్ కేంద్రానికి రాసిన ఓ బహిరంగ లేఖలో రైతులకు కనీస మద్దతు ధర అనేది ప్రాథమిక జాబితా కిందకు వచ్చే పౌరుల జీవించే హక్కుతో సమానమని నొక్కిచెప్పడం గమనార్హం.ఆరుగాలం కష్టించి పండించే పంటకు ఏ ధర లభించేదీ అగమ్యగోచరం అవుతున్న స్థితిలో నుంచి రైతుల ఆందోళన ఆవిర్భవించిందనేది వాస్తవం. ఇది ఒక్క పంజాబ్ రైతుల డిమాండే కాదు, దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లోని రైతులు కోరుకునేది ఇదేనని చెప్పాలి.

# ఎన్‌సీఈఆర్టీకి అనుగుణంగా ఇంటర్‌లో సంస్కరణలు

అమరావతి,ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది.. ఇంటర్ విద్యలో ప్రభుత్వం కీలక సంస్కరణలు తీసుకు వస్తోంది..ఇంటర్ విద్యలో కీలక సంస్కరణలకు ఏపీ ప్రభుత్వం సిద్ధమవుతోంది. దీనికి సంబంధించిన పలు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా తెలిపారు. ప్రధానంగా మొదటి సంవత్సరం పబ్లిక్ పరీక్షలను తొలగించి రెండో సంవత్సరం పరీక్షలను నిర్వహిస్తామని ఇంటర్ బోర్డ్ కార్యదర్శి కృతికా శుక్లా స్పష్టం చేశారు. మొదటి ఏడాది పరీక్షలు కాలేజీలో ఇంటర్నల్ గా నిర్వహిస్తామని.. రెండో సంవత్సరం మార్కులను పరిగణనలోకి తీసుకుంటాం అన్నారు.. చాలా రాష్ట్రాలు ఇంటర్ మొదటి ఏడాది పరీక్షలు నిర్వహించడం లేదన్నారు.. దీంతో పాటు ఇంటర్ లో సిలబస్ మార్చాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. ఎన్‌సిఇఆర్‌టి సిలబస్ ప్రవేశ పెట్టే ప్రతిపాదనకు సంబంధించిన ప్రజాభిప్రాయాన్ని తీసుకుంటాం అని కృతికా శుక్లా..అన్నారు. ఈ మేరకు మీడియా సమావేశంలో ఆమె వెల్లడించారు. 2025-26 ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎన్‌సీఈఆర్టీ పాఠ్య పుస్తకాలు ప్రవేశపెడతాం అని అన్నారు. దీంతో నీట్, జేఈఈ వంటి జాతీయస్థాయి పోటీ పరీక్షలకు సులభమవుతుం దన్నారు. 15 రాష్ట్రాల్లో ఎన్‌సీఈఆర్టీ పాఠ్యపుస్తకాలను ఇంటర్‌లో ప్రవేశపెట్టారు. సిలబస్ సంస్కరణ, నూతన సబ్జెక్ట్ కాంబినేషన్లకు ప్రతిపాదనలు చేస్తున్నాం. పరీక్షల మార్కుల కేటాయింపు విధానంలో సంస్కరణలు తెస్తామని అన్నారు. ఇందులో భాగంగా ఇంటర్ మొదటి సంవత్సర పబ్లిక్ పరీక్షలు తొలగిస్తాం. ఆయా కళాశాలలు అంతర్గతంగా ప్రథమ సంవత్సర పరీక్షలు నిర్వహిస్తాయి. సీబీఎస్ఈ విధానంలో ముందుకెళ్తాం. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలనే బోర్డు నిర్వహిస్తుంది. ఈ నెల 26 లోగా సంస్కరణలపై సలహాలు, సూచనలు పంపాలి. ఇంటర్ బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ప్రతిపాదిత సంస్కరణల వివరాలు ఉంచాం' అని కృతికా శుక్లా తెలిపారు. ఇంటర్ విద్యలో సంస్కరణలపై విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తల నుంచి సలహాలు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. 'చాలా ఏళ్లుగా ఇంటర్ విద్యలో సంస్కరణలు జరగలేదు. జాతీయ కరికులం చట్టాన్ని అనుసరించి సంస్కరణలు చేపడుతున్నాం. సైన్స్, ఆర్ట్స్, భాషా సబ్జెక్టుల్లో సంస్కరణలు అమలు చేస్తాం. 2024-25 నుంచి పదో తరగతిలో ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాలు ప్రవేశపెట్టారు. గత కొన్నేళ్లుగా ఇంటర్ బోర్డ్ లో సంస్కరణలు జరగలేదు.. ప్రస్తుతం నాలుగు సంస్కరణలు ప్రధానంగా ఉన్నాయి అన్నారు కృతికా శుక్లా.. గత కొన్నేళ్లుగా పాఠ్య పుస్తకాల్లో మార్పులు జరగలేదు.. ఇంటర్ విద్యార్థులు పోటీ పరీక్షలకు హాజరు అవుతారు.. వీరికి తగ్గట్టుగా కొత్త సిలబస్ తీసుకు రాబోతున్నాం అన్నారు. ప్రస్తుతం ఇంటర్ మొదటి సంవత్సరం సిలబస్ మార్పుపై దృష్టి పెట్టాం.. ఇంటర్ మొదటి సంవత్సరం తెలుగు, ఇంగ్లీషు సిలబస్ మారుస్తున్నాం అన్నారు.. సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్ కమిటీ ఈ సిలబస్‌పై దృష్టి పెట్టిందన్నారు. తెలుగు, సంస్కృతం, ఉర్దూ ఏదైనా అప్షన్ తీసుకునే అవకాశం విద్యార్థులకు ఉంది.. ఈ సిలబస్ వల్ల మాథ్స్.. కెమిస్ట్రీ లో ప్రస్తుతం ఉన్న సిలబస్ బాగా తగ్గుతుందన్నారు.. అఃఉఇ సిలబస్ ప్రకారం ప్రస్తుతం మార్పులు జరుగుతున్నాయని వెల్లడించారు.. ఇంటర్ లో ఇక నుంచి ఇంటర్నల్ ప్రాక్టికల్ మార్క్స్ ఉంటాయి. ప్రతిసబ్జెక్టుకు ఈ ఇంటర్నల్ మార్కులు ఉంటాయి.. 20 మార్కులు ఇంటర్నల్ గా ఉంటాయని ఏపీ ఇంటర్ బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా వెల్లడించారు.

# ఆర్మీ కెప్టెన్‌గా చెప్పుకొని.. లక్షల్లో వసూలు

లక్నో,ఒడిశాకు చెందిన 40 ఏళ్ల వ్యక్తి.. ఆర్మీ కెప్టెన్ అని చెప్పుకుంటూ.. మహిళల్ని మోసం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాలాసోర్ జిల్లాకు చెందిన హైదర్ అలీ అనే వ్యక్తి.. రిలేషన్‌షిప్ పేరుతో మహిళలతో పరిచయం పెంచుకునేవాడు. ఆ తర్వాత వాళ్ల నుంచి లక్షల్లో డబ్బులు వసూల్ చేసేవాడు. పోలీసుల వివరాల ప్రకారం.. తన పేరు హార్తిక్ బిగ్లో అని, ఆర్మీ మెడికల్ కార్ప్స్ ఆఫీసర్‌ను అంటూ అతను పరిచయం చేసుకునేవాడు. ఆడవాళ్లతో పరిచయం పెంచుకున్నాక, ఏవేవో కారణాలు చెబుతూ వారి నుంచి డబ్బులు లాగేవాడు. డబ్బులు ముట్టిన తర్వాత ఇక అతను తన కమ్యూనికేషన్ ముగించేవాడు. ఆ తర్వాత మరో లొకేషన్‌కు వెళ్లి కొత్త టార్గెట్లను వెతికేవాడు అని తెలుస్తోంది. మహిళల్ని బెదిరించి వసూల్ చేసిన డబ్బుతో చాలా విలాసవంతమైన జీవితాన్ని గడిపేవాడు. అయితే లక్నోలో ఓ మహిళ పరిచయం అయిన తర్వాత సీన్ మారింది. అతనిపై పోలీసు ఫిర్యాదు ఇవ్వడంతో .. ఆ వ్యక్తి నాటకాలు బయటపడ్డాయి. హైదరాబాద్, కేరళ, కర్నాటక, బెంగాల్ రాష్ట్రాల్లో హైదర్ అలీ సెక్యూర్టీ సంస్థల్లో పనిచేశాడు. ప్రతి సిటీలోనూ అతను మహిళల్ని వంచించినట్లు తెలుస్తోంది. ఆర్మీ దుస్తుల్లో ఉన్న ఫోటోలను అతను ఇన్‌స్టాగ్రామ్ ప్రొఫైల్స్‌లో పోస్టు చేసేవాడు. ఇండియన్ కమాండో హార్దిక్, ఆర్మన్‌బిగ్లో, ఆర్మీబెగ్లో, సోల్జర్స్3889 పేర్లతో అతను ప్రొఫైల్స్ క్రియేట్ చేశాడు. ఆర్మీ దుస్తులు, త్రీస్టార్ ఫ్లాప్స్, ఆర్మీ బీరెట్, ఫేక్ ఆధార్ కార్డు, ఆర్మీ క్యాంటీన్ కార్డు లాంటి వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతనికి ఏమైనా క్రిమినల్ రికార్డు ఉందా లేదా అన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. తనతో శారీరక సంబంధం పెట్టుకుని, డబ్బులు ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదు ఇచ్చిన వ్యక్తి పేర్కొన్నట్లు పోలీసు అధికారి నిపున్ అగర్వాల్ తెలిపారు. మతాన్ని చెప్పకుండానే అందరితో పరిచయం పెంచుకున్నట్లు తెలిసింది. అతని కాల్ రికార్డులను పరిశీలిస్తున్నారు. నలుగురు మహిళలతో లింకు ఉన్నట్లు నిందితుడు అలీ చెప్పినట్లు పోలీసులు వెల్లడించారు.

# బంగ్లా కథనాలను తిప్పికొట్టిన బిఎస్ఎఫ్

న్యూఢిల్లీ,భారత్‌లో 5 కిలోమీటర్ల మేరకు భూభాగాన్ని బంగ్లాదేశ్ సైన్యం ఆక్రమించుకొందన్న మీడియా కథనాలను సరిహద్దు భద్రతా దళం బీఎస్ఎఫ్ ఖండించింది. అవి పూర్తిగా బాధ్యతారాహిత్యమైన, ఆధార రహిత కథనాలని పేర్కొంది. 'నార్త్ 24 పరగణాస్ జిల్లాలో రాంఘాట్ గ్రామంలోని బగ్దా బ్లాక్‌లోని భూభాగంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ అంతర్జాతీయ సరిహద్దు కొడల్యా నదీ తీరం నుంచి వెళుతుంది. ఇరువైపులా కచ్చితమైన హద్దులను గుర్తించి స్తంభాలు పాతి వేసిన కంచె ఉంది. ఇక ఈ సరిహద్దు వెంట బీఎస్ఎఫ్ గస్తీలో ఎటువంటి మార్పు జరగలేదు. ఒక్క అంగుళం భారత భూభాగాన్ని తీసుకోలేదు, తీసుకోలేరు కూడా. 1975 భారత్ బంగ్లా బోర్డర్ గైడ్‌లైన్స్ ఆధారంగా బీఎస్ఎఫ్, బీజీబీ వాటి విధులను ప్రశాంతంగా నిర్వహిస్తున్నాయి' అని బీఎస్ఎఫ్ దక్షిణ బెంగాల్ ఫ్రంటియర్ పేర్కొంది. అంతేకాదు.. కంచె లేని చోట్ల కూడా బంగ్లాదేశీల చొరబాట్లు, స్మగ్లింగ్ వంటివి జరగకుండా కఠినచర్యలు తీసుకొన్నట్లు బీఎస్ఎఫ్ వివరించింది. బంగ్లాదేశ్‌కు చెందిన మీడియాలోని కొన్ని వర్గాలు నిరాధారంగా వీటిని ప్రచారం చేస్తున్నాయని బీఎస్ఎఫ్ అభిప్రాయపడింది. అంతేకాదు.. బోర్డర్ గార్డ్స్ బంగ్లాదేశ్ (బీజీబీ) మోటార్ బోట్లు, ఏటీవీలతో డిసెంబర్ 19 నుంచి గస్తీ మొదలుపెట్టిందన్న ప్రచారాన్ని కూడా కొట్టిపారేసింది. మాల్దా జిల్లాలో సుక్‌దేబ్‌పుర్‌లో సరిహద్దుల వెంట బీఎస్ఎఫ్, బీజీబీ గార్డ్స్‌కు మధ్య ఫెన్సింగ్ విషయంలో గొడవ జరిగింది. భారత్ వైపు కంచె నిర్మాణానికి బంగ్లాదేశ్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ తర్వాత కొద్దిసేపటికే అక్కడ గ్రామాల్లో ప్రజలు చేరుకొని వందేమాతరం, భారత్ మాతాకీ

# ఆలయ భూముల కౌలు చెల్లింపులు.. పట్టించుకునేది ఎవరు ?



జడ్చర్ల, మహబూబ్నగర్ జిల్లాలో పేరుగాంచిన పురాతన దేవాలయాల్లో ఒకటిగా ఉన్న శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి గంగాపురం ఆలయానికి రావలసిన కౌలు చెల్లింపు మొండి బకాయిలు గత కొన్నేళ్ల నుంచి రావాల్సి ఉన్న రావడంలేదని, గతంలో ఎవరెవరికి కౌలు ఇచ్చారన్న వివరాల కు సంబంధించిన రికార్డులు ఆలయ కార్యాలయంలో లేకపోవడం తీవ్ర ఆరోపణలకు దారితీస్తున్నది. ఆలయానికి సంబంధించి 119 ఎకరాల భూములు గంగాపురం గ్రామంలో ఉన్నాయి. ఈ భూములకు ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాలలో భాగంగా నిర్వహించే వేలంపాటలో గ్రామానికి చెందినవారు దక్కించుకోవలసి ఉంటుంది, వేలంపాటలో పాల్గొనే వారికి కొన్ని నియమ నిబంధనలు ఉన్నాయని, ఒకసారి వేలంపాటలో దక్కించుకొని కౌలు చెల్లింపు సరిగా చేస్తేనే భవిష్యత్తులో మళ్ళీ వేలం పాటలో పాల్గొనాలని నిబంధనలు ఉన్నాయి. గత ఎనిమిదేళ్ల నుంచి జరిగిన వేలంపాటలో పాల్గొన్న వ్యక్తి నేటికీ 25 వేలకు పైగా బకాయి ఉన్న నేటికీ ఆ కౌలు చెల్లింపు చేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ అంశాలపై తవ్వే కొద్ది ఇంకా ఎన్ని విషయాలు వెలుగులోకి వస్తాయో, ఆలయ నిర్వహణ లో భాగంగా అనేక అవకతవకలు జరిగినట్లు , కౌలు చెల్లింపు చెల్లింపునకు సంబంధించి రికార్డులు నమోదు చేయడంలో పూర్తి విఫలంగా వ్యవహరించినట్టు విశ్వసనీయ సమాచారం . ఇప్పటికైనా అధికారులు స్పందించి కౌలు బకాయిల పై విచారణ జరిపి మొండి బకాయిలు వసూలు చేసి ఆలయ అభివృద్ధికి దోహదపడాలని భక్తులు కోరుతున్నారు . ఈ విషయమై ఆంధ్రప్రభ రిపోర్టర్ ఆలయ ఈవో దీప్తి రెడ్డి ని సంప్రదించగా ఇటీవలే పదవి బాధ్యతలను చేపట్టానని , కార్యాలయంలో ఉన్న సమాచారం మేరకు కౌలు చెల్లింపులో జాప్యం ఎందుకు జరిగిందన్న అంశాలు ఆరా తీసి , వారికి నోటీసులు అందజేస్తామని, ప్రతి సంవత్సరం కౌలు చెల్లింపు ద్వారా దేవాలయానికి నాలుగు లక్షలకు పైగా ఆదాయం రానున్నట్లు ఆలయ ఈవోతెలిపారు.

# వాటి కోసం మరో రెండేళ్లు వెయిట్ చేయాల్సిందే

హైదరాబాద్,అంతకంతకూ పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్ లను సమకూర్చుకోవటానికి మరింత కాలం పట్టనుంది. దీనికి సంబంధించిన ఆసక్తికర అంశాలు తాజాగా వెలుగు చూశాయి. హైదరాబాద్ మెట్రోలో ఇప్పటివరకు నడుస్తున్న రూట్లలో అత్యధిక సంఖ్యలో ప్రయాణికులు ప్రయాణిస్తున్న మార్గం అమీర్ పేట - రాయదుర్గం మెట్రో స్టేషన్. ఈ రెండు స్టేషన్ల మధ్య రోజుకు సగటున 5 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. మరి.. ముఖ్యంగా ఉదయం..సాయంత్రం వేళలో ఈ రద్దీ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.ట్రైన్ లోపల కాలుపెట్టలేనంతగా రద్దీ ఉంటోంది. దీంతో.. ఈ మార్గంలో రద్దీ వేళలో అదనపు బోగీలు ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో వస్తోంది. దీనిపై మెట్రో అధికారులుఇప్పటివరకు అధికారికంగా మాట్లాడింది లేదు. తాజాగా నిర్వహించిన ఒక కార్యక్రమంలో అదనపు బోగీల గురించి ఎల్ అండ్ టీ అధికారులతో పాటు మెట్రో అధికారులను ప్రశ్నించగా.. అసలు విషయాన్ని చెప్పుకొచ్చారు.ప్రస్తుతం నడుపుతున్న కోచ్ లను అప్పట్లో దక్షిణ కొరియా నుంచి హ్యుందాయ్ రోటెమ్ సంస్థ సరఫరా చేసింది. ఆ కోచ్ లనే నడుపుతున్నారు. ప్రస్తుతం ఈ సంస్థ భారత్ కు కోచ్ లను తయారు చేయటం లేదు. మరోవైపు.. దేశీయంగా డెవలప్ చేసిన కోచ్ లను తీసుకురావటానికి కనీసం పద్దెనిమిది నెలల సమయం పడుతుంది. నాగపూర్.. పుణె నుంచి లీజు పద్దతిలో కోచ్ లను తీసుకురావాలని భావించినా.. అందుకు పరిస్థితులు



అనుకూలంగా లేవు.దీంతో.. దేశీయంగా తయారుచేసే కోచ్ లను తీసుకురావాలన్నా.. వాటికి ఆర్డర్ ఇచ్చి.. అవి తయారై.. పట్టాల మీదకు ఎక్కే సరికి 18 నెలల పడుతుందని చెబుతున్నారు. దీంతో.. ఇప్పటికిప్పుడు కోచ్ లకు ఆర్డర్ ఇచ్చినా.. అవి అందుబాటులోకి వచ్చేసరికి రెండేళ్లు పడుతుందని అంటున్నారు. మరోవైపు ఆర్థిక ఇబ్బందుల్లో కిందా మీదా పడుతున్న ఎల్ అండ్ టీని ప్రభుత్వం ఆదుకుంటే తమ సమస్యల నుంచి గట్టెక్కేందుకు వీలవుతుందని చెబుతున్నారు. మొత్తంగా ప్రయాణికుల ఇబ్బందుల్ని గుర్తించి ప్రభుత్వం చొరవ తీసుకుంటే తప్పించి..మెట్రో అదనపు కోచ్ ల ఇష్యూ ఒక కొలిక్కి రాదని చెప్పక తప్పదు.

# పాడ్ కాస్ట్ లో తొలిసారి.. 'పొరపాట్లు' ఒప్పేసుకున్నారు

న్యూఢిల్లీ,గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కానీ.. ప్రధాని అయిన పదిన్నరేళ్లలో కానీ.. మీడియా ముందుకు రావడానికి ఇష్టపడని నాయకుడు మోదీ. దీనికి ఆయన కారణాలు ఆయనకు ఉండొచ్చు. ఏదైనా చెప్పాలనుకుంటే నేరుగా టీవీల్లోకి వచ్చేయడం మోదీ స్టయిల్. గత రెండు విడతల్లో ఇదే జరిగింది. మూడో విడతలో మాత్రం కాస్త మార్పు కనిపిస్తోంది. తాజాగా మోదీ ఓ పాడ్ కాస్ట్ ఇంటర్వ్యూ ఇచ్చారు. దీనికిముందు కువైత్ పర్యటనలో అక్కడి అధికారిక మీడియాతో మాట్లాడారు.


సాధారణ మీడియాకు కాదు..

పాడ్ కాస్ట్.. ఇప్పుడో ఇంటర్వ్యూ స్టయిల్. సాధారణ మీడియా ఇంటర్వ్యూ తరహాలో కాకుండా.. క్లుప్తంగా చెప్పాలంటే ఇది ఒక శ్రవణ రూపంలో ఉన్న బ్లాగ్. తాజాగా జిరోదా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ ప్రధాని మోదీని ఇంటర్వ్యూ చేశారు. ఎప్పుడూ మీడియా ముందు తన మనోగతం విప్పని మోదీ.. ఇందులో తన మనసు విప్పి మాట్లాడారు. తానేమీ దేవుడిని కాదని.. సాధారణ మనిషినేనని చెప్పుకొచ్చారు. పొరపాట్లు జరుగుతాయని, గతంలో చేసిన వ్యాఖ్యలను గుర్తు చేసుకున్నారు. మోదీ పాడ్ కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొనడం ఇదే తొలిసారి. జిరోదా ప్రముఖ వ్యాపారి. ఆయన నిర్వహిస్తున్న పాడ్ కాస్ట్ లో మోదీ అతిథిగా పాల్గొన్నారు.దీని ట్రైలర్ వీడియోను నిఖిల్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ప్రధాని మోదీ రీ పోస్ట్ చేశారు. గతంలో చేసిన వ్యాఖ్యలను వీరు గుర్తుచేసుకున్నారు. 'ఈ ఇంటర్వ్యూను మీరంతా ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నా' అని మోదీ ట్వీట్ చేశారు. 2 నిమిషాలకు పైగా ఉన్న మోదీ-నిఖిల్ పాడ్ కాస్ట్ వీడియో ట్రైలర్ లో రాజకీయాలు, వ్యవస్థాపకత, లీడర్ షిప్ చాలెంజెస్ తదితర అంశాలపై చర్చించారు. మొట్టమొదటే నిఖిల్ కామత్.. ఓ ప్రధానిని ఇంటర్వ్యూ



చేస్తుండడం తనకు ఒకింత భయంగా ఉందంటూ మొదలుపెట్టారు. 'ఇదే నా తొలి పాడ్ కాస్ట్. ప్రజలు ఎలా స్వీకరిస్తారో తెలియదు' అని వాతావరణాన్ని తేలిక చేశారు.రాజకీయాల్లోకి రావాలనుకునే యువతకు మీరిచ్చే సూచనలు ఏమిటి? అని కామత్ ప్రశ్నించగా.. 'రాజనీతి' కలిగినవారు రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని మోదీ జవాబిచ్చారు. సొంత లక్ష్యాలు నెరవేర్చుకునేందుకు కాకుండా ప్రజా సేవ చేయాలన్న లక్ష్యాన్ని పూనుకోవాలని సూచించారు.మోదీ గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు చేసిన ప్రసంగాల ప్రస్తావన కూడా ఈ పాడ్ కాస్ట్ లో వచ్చింది. నేను ఏదేదో అని ఉంటాను. పొరపాట్లు ఉండొచ్చు. నేనూ మనిషినే. దేవుడిని కాదుగా" అంటూ చెప్పుకొచ్చారు.గత రెండు పర్యాయాలు ప్రధానిగా తన అనుభవాలను మోదీ పాడ్ కాస్ట్ లో పంచుకున్నారు. పాడ్ కాస్ట్ పూర్తి వీడియో ఎప్పుడు బయటకు వస్తుందో తేదీ పేర్కొనలేదు.

# విదేశాలకు వెళ్తున్నారా? విజృంభిస్తోన్న హెచ్ఎంపీవీ వైరస్..



హైదరాబాద్,విదేశాలకు వెళ్లేందుకు ప్లాన్ చేస్తున్నారా? తస్మాత్ జాగ్రత్త.. హెచ్ఎంపీవీ వైరస్ ప్రపంచాన్ని వణికిస్తోంది. చైనాలో మొదలైన ఈ వైరస్ ఇప్పుడు భారత్ సహా ఇతర దేశాలకు నెమ్మదిగా వ్యాపిస్తోంది. చైనా, మలేషియా, హాంకాంగ్ ఇతర ఆసియా దేశాలలో హ్యూమన్ మెటాప్న్యూమోవైరస్ కేసులు పెరుగుతున్నాయి. దాంతో ఈ వైరస్ వ్యాప్తిపై ప్రపంచవ్యాప్తంగా భయాందోళలను రేకెత్తించింది.భారత్‌లో ఇప్పటికే అనేక హెచ్ఎంపీవీ కేసులు నమోదు కావడంతో ప్రభుత్వ అధికారులను కేంద్ర ప్రభుత్వం అప్రమత్తం చేసింది. పెరుగుతున్న వైరల్ ఇన్‌ఫెక్షన్‌లు హాలీడే సీజన్‌లో అంతర్జాతీయ ప్రయాణాల గురించి మరింత ఆందోళన కలిగించేలా ఉన్నాయి. అనేక దేశాలలో పెరుగుతున్న హెచ్ఎంపీవీ ఇన్ఫెక్షన్ల మధ్య ప్రజలు వారి విదేశీ పర్యటనల సమయంలో వైద్య అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తే.. ప్రయాణ బీమా ఎలా ప్రయోజకరంగా ఉంటుందో తెలుసుకునే ప్రయత్నం చేద్దాం..

హెచ్ఎంపీవీ వైరస్ : ప్రయాణ బీమా ఇతర వైరల్ ఇన్ఫెక్షన్ చికిత్సను కవర్ చేస్తుందా? :

ప్రయాణ బీమా పాలసీలు సాధారణంగా వైద్యపరమైన అత్యవసర పరిస్థితులు, ఆకస్మిక గాయాలు, అనారోగ్యాలకు సంబంధించిన చికిత్సలను కవర్ చేస్తాయి. ప్రజలు తమ పర్యటనలో హెచ్ఎంపీవీ, ఇతర వైరల్ ఇన్‌ఫెక్షన్‌లకు గురైనప్పుడు కూడా ఆర్థిక సాయం పొందవచ్చు. "మా ట్రావెల్ ఇన్సూరెన్స్ పాలసీ విదేశాలకు ప్రయాణిస్తున్నప్పుడు ఫ్లూ, హెచ్ఎంపీవీ వంటి వైరస్‌లతో సహా ఊహించని అనారోగ్యాలు లేదా గాయాలకు సంబంధించిన వైద్య అత్యవసర పరిస్థితులు, చికిత్సలను కవర్ చేస్తుంది.ఇందులో హాస్పిటలైజేషన్, సర్జికల్ విధానాలు, అత్యవసర వైద్య తరలింపులు ఉన్నాయి" అని రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ సీఈఓ రాకేష్ జైన్ అన్నారు. ప్రయాణ బీమా ప్రయోజనాల కోసం పాలసీ జారీ సమయంలో బీమా సంస్థలు వినియోగదారులను ప్రీ-డీసీజెస్ (ఏదైనా ఉంటే) తప్పనిసరిగా ప్రకటించాలని జైన్ పేర్కొన్నారు. అయితే, ప్రయాణ బీమా పాలసీలు, వాటి కవరేజీ మారవచ్చు. అందువల్ల, ప్రయాణికులు తమ పాలసీని ఖరారు చేసే ముందు జాగ్రత్తగా అంచనా వేయాలి. సాధారణ అనారోగ్యాలు, సంభావ్య అత్యవసర పరిస్థితులను కవర్ చేస్తున్నాయో లేదో ధృవీకరించడం చాలా ముఖ్యమని పాలసీబజార్‌లోని ట్రావెల్ ఇన్సూరెన్స్ హెడ్ మీట్ కపాడియా అన్నారు.

విదేశీ పర్యటనలో హెచ్ఎంపీవీ వైరస్ సోకితే ఏం చేయాలి? :

అనేక బీమా కంపెనీలు వినియోగదారులకు 24/7 సహాయాన్ని అందిస్తాయి. వారు తమ హాలిడే ట్రిప్‌ల సమయంలో ఆస్పత్రి గుర్తింపు, వైద్య అత్యవసర పరిస్థితుల్లో చికిత్స ఖర్చులు, ఇతర సేవల కోసం అసిస్టెన్స్ కోసం వారి బీమా ప్రొవైడర్‌లను సంప్రదించవచ్చు. "మా పాలసీదారులు మార్గదర్శకత్వం, మద్దతు కోసం మా (24/7) ఎమర్జెన్సీ సహాయ బృందాన్ని సంప్రదించవచ్చు.ఆస్పత్రిలో చేరే ఏర్పాట్లు, పేమెంట్లకు హామీ ఇవ్వడం, అవసరమైతే మెరుగైన వైద్యం కోసం తరలింపు సహా వైద్య చికిత్సను అందించడంలో సాయం చేస్తాం. పాలసీ నిబంధనలు, షరతుల ప్రకారం.. క్లెయిమ్‌లను మరింత ప్రభావవంతంగా ప్రాసెస్ చేసేందుకు ఇవి అవసరం కాబట్టి అన్ని మెడికల్ రికార్డ్‌లు, రసీదులను దగ్గర ఉంచుకోవడం చాలా కీలకం" అని రాకేష్ జైన్ అన్నారు.అగ్రిగేటర్ ద్వారా ప్రయాణ బీమా పాలసీని కొనుగోలు చేయడం వల్ల క్లెయిమ్ సమయంలో లేదా ప్రయోజనాలను పొందడంలో వ్యక్తులకు సహాయపడవచ్చు. "ప్రయాణికులు తమ బీమా సంస్థ లేదా పాలసీబజార్‌కు తెలియజేయడం ద్వారా నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో నగదు రహిత సేవలను పొందవచ్చు. నగదు రహిత ఎంపికలు అందుబాటులో లేని అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన మెడికల్ డాక్యుమెంటేషన్‌తో రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్‌లను ప్రాసెస్ చేయవచ్చు" అని కపాడియా చెప్పారు.

ట్రావెల్ ఇన్సూరెన్స్ ఇతర ప్రయోజనాలు ఏంటి? :

"మెడికల్ ఎమర్జెన్సీలతో పాటు, సమగ్ర ప్రయాణ బీమా పథకాలు ట్రిప్ జాప్యాలు, సామాను కోల్పోవడం, వైద్య తరలింపు ఇతర అంతరాయాలను కూడా కవర్ చేస్తాయి. ప్రయాణికులు అనేక రకాల ఆకస్మిక పరిస్థితులకు సిద్ధంగా ఉన్నారని సూచిస్తుంది" అని కపాడియా పేర్కొన్నారు.

హెచ్ఎంపీవీ లక్షణాలు, కారణాలు, నివారణ, చికిత్స :

ఈ వైరస్ వల్ల వచ్చే ఇన్ఫెక్షన్ దగ్గు, జలుబు, తుమ్ములు, జ్వరం మొదలైన సాధారణ ఫ్లూ-వంటి లక్షణాల మాదిరిగానే ఉంటాయి. కలుషితమైన ఉపరితలాలను తాకడం, గాల్లో శ్వాసకోశాలను పీల్చడం, సోకిన వ్యక్తులతో ప్రత్యక్ష సంబంధం హెచ్ఎంపీవీ సంక్రమణకు కారణం కావచ్చు. హెచ్ఎంపీవీ నివారణ కోసం ప్రజలు తప్పనిసరిగా సామాజిక దూరాన్ని పాటించాలి. క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవాలి. బహిరంగ ప్రదేశాల్లో మాస్క్ ధరించాలి. వైరస్ సోకితే, వ్యక్తి కోలుకోవడానికి 5 నుంచి 6 రోజులు పట్టవచ్చు. వైద్యులు సాధారణంగా ఇన్హేలర్ల వంటి ఓటీసీ మందులను సిఫార్సు చేస్తారు.

# కవిత అరెస్టు వ్యూహాన్నే కేటీఆర్ ఇష్యూలో అమలు చేస్తున్నారా?



హైదరాబాద్,పాత కాలం నాటి చిట్టి కథ ఒకటుంది. ఒక కుక్కను చంపాలంటే.. మొదట దాన్ని పిచ్చి కుక్క అని ముద్ర వేయాలి. అది నిజమని నమ్మించాలి. ఆ తర్వాత దాన్ని మనం చంపక్కర్లేదు. అందరూ కలిసి చంపేస్తారు. ఇప్పటి రాజకీయాలు కూడా అలానే ఉన్నాయి. రాజకీయ శత్రుత్వం ఎంత ఉన్నప్పటికి ప్రత్యక్షంగా చర్యలు తీసుకుంటే మొదటికే మోసం వస్తుంది. అదే.. కాస్త వెయిట్ చేసి.. సరైన అంశాన్ని టేకప్ చేస్తే.. రాజకీయంగానే కాదు వ్యక్తిగతంగానూ ఎన్ని తిప్పలు పెట్టాలో అన్ని తిప్పలు పెట్టొచ్చు. అంత చేసినప్పటికి ప్రజల నుంచి వ్యతిరేకత కూడా రాదు.గులాబీ బాస్ కేసీఆర్ ను ఇరుకున పడేసేందుకు.. ఆయన మనో స్థైర్యాన్ని దెబ్బ తీయటానికి.. ఆయన కుమార్తె కవిత చేసిన తప్పుతో సాధ్యమైందని చెబుతారు. కవితను లక్ష్యంగా చేసుకోవటం ద్వారా కేసీఆర్ కు దిమ్మతిరిగే షాక్ ఇచ్చినట్లుగా వ్యాఖ్యానిస్తుంటారు. కవిత మీద ఆరోపణలు చేసినట్లుగా ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఆమె పాత్ర నిజంగానే ఉందా? లేదా? అన్నది న్యాయ వ్యవస్థ తేల్చటానికి మరో పదేళ్లు పట్టొచ్చు.కానీ.. ఇప్పటికైతే జరగాల్సిన డ్యామేజ్ జరిగి పోయింది. అన్నింటికి మించి తెలంగాణ బాపు గారాలపట్టిని జైల్లో వేసినప్పటికి.. తెలంగాణ సమాజంలో ఈ అంశం ఎలాంటి భావోద్వేగాన్ని రగలకపోవటమే కేసీఆర్ కు ఎదురైన అతి పెద్ద ఎదురుదెబ్బగా అభివర్ణిస్తారు.నిజానికి కవిత అరెస్టు ఎపిసోడ్ ను చూస్తే.. ఒక క్రమపద్ధతిని ఫాలో కావటం కనిపిస్తుంది. వాయిదాల పద్ధతి మాదిరి..కవిత మీద కేసును బిల్డ్ చేయటం..ఆమె తప్పు చేసిందేమో అన్న సందేహానికి గురయ్యేలా చేయటం.. ఏదో జరిగి ఉండకపోతే ఇంత వరకు విషయం ఎందుకు వస్తుందన్న భావన కలిగించటం.. చివరకు కవిత అరెస్టు వేళకు.. ప్రజల్లోనూ ఎలాంటి సానుభూతి లేకుండా చేసిన వైనం అందరిని ఆకర్షించింది.తాజాగా మాజీ మంత్రి కేటీఆర్ ఇష్యూలోనూ కవిత విషయంలో అనుసరించిన పద్ధతినే ఫాలో అవుతున్నారా? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. ఫార్ములా ఈ రేస్ లో సమ్ థింగ్.. సమ్ థింగ్ జరిగిందన్న భావన ప్రజల్లో అంతకంతకు ఎక్కువ అవుతోంది. కేటీఆర్ అరెస్టు అన్నంతనే.. ఉలిక్కిపడే స్థాయి నుంచి.. ఆయన రేపో మాపో అరెస్టు అవుతారన్న విషయాన్ని అందరూ అర్థం చేసుకునేలా పరిస్థితులు చోటు చేసుకోవటం.. ఆయనపై వచ్చిన ఆరోపణలు..దానికి ఖండనలు.. ఆ తర్వాత వాటికి కౌంటర్లు ఇలా సాగిపోయి.. మొత్తంగా ఫార్ములా ఈ రేసింగ్ లో ఏదో జరిగిందన్న విషయాన్ని ప్రజలు నమ్మే వరకు ఇప్పుడు విషయం వెళ్లింది.ఇలాంటి వాతావరణంలో కేటీఆర్ అరెస్టు జరిగినా.. ఇదేదో రాజకీయ ప్రతీకారంగా ప్రజలు భావించరు. అదే సమయంలో తాను ఎలాంటి తప్పులు చేయలేదన్న విషయాన్నిచెప్పుకునే క్రమంలో కేటీఆర్ ప్రదర్శించిన దూకుడు ఆయనకు నష్టం చేసేలా మారిందని చెప్పాలి. ఎందుకంటే.. తనపై పడిన మచ్చను కడుక్కునేందుకు కేటీఆర్ అనుసరించిన విధానం సరిగా లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. తనపై చేస్తున్న ఆరోపణలకు అందరూ నమ్మే సాక్ష్యాల్ని.. ఆధారాల్ని చూపే కన్నా నోటికి పని చెప్పిన కేటీఆర్ తీరు ఆయనకు నష్టం వాటిల్లేలా చేసిందంటున్నారు.ఒకవేళ కేటీఆర్ అరెస్టు కానీ జరిగితే.. గులాబీ పార్టీ అనుకుంటున్నట్లుగా ప్రజల్లో సానుభూతి భారీగా వస్తుందన్నఅంచనాల్లో ఏ మాత్రం నిజం లేదంటున్నారు. ఇప్పటివరకు చోటు చేసుకున్న అన్ని పరిణామాలు కవిత లిక్కర్ స్కాం వేళలో ఎలా జరిగాయో.. ఇప్పుడు అలానే జరుగుతున్నాయంటున్నారు. మరి.. ఈ వాదనలో నిజం ఎంతో కాలమే డిసైడ్ చేయాలి.

# 1978 సంభాల్ అల్లర్లపై మళ్లీ దర్యాప్తు..?

లక్నో: ఇటీవల కాలంలో ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని సంభాల్ నగరం పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. నవంబర్ నెలలో సంభాల్‌లోని షాహీ జామా మసీదు సర్వేకి వెళ్లిన అధికారులపై ఓ వర్గం రాళ్లదాడి చేసింది.ఈ దాడిలో నలుగురు మరణించారు. జామా మసీదు పురానత హరిహర్ ఆలయాన్ని కూల్చేసి కట్టినట్లు హిందూ వర్గం ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలోనే కోర్టు సర్వేకి ఆర్డర్ ఇచ్చింది.ప్రస్తుతం మరో వార్త వినిపిస్తోంది. 1978లో సంభాల్‌లో భారీగా మత ఘర్షణలు జరిగాయి. ఈ కేసును తిరిగి దర్యాప్తు చేస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీనిపై ఉత్తర్ ప్రదేశ్ పోలీసులు క్లారిటీ ఇచ్చారు. ఈ వదంతులను తిరస్కరించారు. "1978లో సంభాల్‌లో జరిగిన మత అల్లర్లపై తిరిగి దర్యాప్తు ప్రారంభిస్తున్నట్లు సోషల్ మీడియా మరియు ఇతర ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా తప్పుదారి పట్టించే సమాచారం వ్యాప్తి చెందుతోంది. అయితే, అలాంటి ఏమీ లేదు" అని సంభాల్ పోలీసు సూపరింటెండెంట్ కృష్ణ కుమార్ బిష్ణోయ్ అన్నారు.1978 అల్లర్లకు సంబంధించిన వివరాలు కోరుతూ.. డిసెంబర్ 17న ఎమ్మెల్యే శ్రీష్ చంద్ర శర్మ రూల్ 115 కింద ఒక లేఖని సమర్పించారని ఎస్పీ తెలిపారు. దీని వల్ల ప్రభుత్వం ఈ విషయంపై సమాచారం కోరినట్లు చెప్పారు. దీనికి సంబంధించిన సమాచారాన్ని కలెక్ట్ చేస్తున్నామని, ప్రక్రియ పూర్తి కాగానే ప్రభుత్వానికి పంపుతామని చెప్పారు.

భారత చరిత్రలో అతిపెద్ద అల్లర్లు:

మొరాదాబాద్ జిల్లాలోని సంభాల్‌లో జరిగిన 1976 అల్లర్లలో దాదాపుగా 184 మంది మరణించినట్లు సమాచారం. అయితే, 2010లో ఆధారాలు లేకపోవడంలో కోర్టు నిందితులను నిర్దోషులుగా విడుదల చేసింది. 1976లో మసీదు మతాధికారి హత్య తర్వాత సంభాల్ లో అల్లర్లు చెలరేగాయి. రెండు నెలల పాటు సంభాల్‌లో కర్ఫ్యూ ఉంది. ఆ సమయంలో జనతా పార్టీ అధికారంలో ఉంది. రామ్ నరేష్ యాదవ్ సీఎంగా ఉన్నారు. మార్చి 28, 1978లో సంభాల్‌లో అతిపెద్ద అల్లర్లు జరిగాయి. హోలికా దహన్ స్థలంలో రెండు వర్గాల మధ్య ఉద్రిక్తత నెలకొంది. ఒక దుకాణదారుడు మరో వర్గానికి చెందిన వ్యక్తిని చంపడంతో



అల్లర్లు చెలరేగాయి. అల్లర్ల సమయంలో వ్యాపారవేత్త బన్వారీ లాల్ తన బావమరిది మురారి లాల్ భవనంలో దుకాణదారులను దాచిపెట్టాడు. అల్లర్లకు పాల్పడిన వారు ట్రాక్టర్‌తో భవనం గేటు పగలగొట్టి 24 మందిని చంపారు. సంభాల్ చుట్టుపక్కల అన్ని ఊర్లలో అల్లర్లు జరిగాయి. కొన్ని మృతదేహాలు దొరకకపోవడంతో వారి బొమ్మలను దహనం చేశారు. వ్యాపారి బన్వారీ లాల్‌ను కూడా దారుణంగా చంపారు. అల్లర్లలో అతడిని పట్టుకుని అతని అవయవాలు నరికేశారు. ఈ కేసులో 48 మంది నిందితులుగా ఉన్నారు. కానీ వీరిపై తగిన ఆధారాలు లేకపోవడంతో 2010లో అందరూ నిర్దోషులుగా విడుదలయ్యారు. తీర్పు చెప్పిన న్యాయవాది.. ఇలాంటి వారిని ఉరితీయలేకపోతున్నామంటే నమ్మలేకుండా ఉన్నామని అన్నారు.

# సీఎం చంద్రబాబు వైఫల్యం వల్లే తిరుపతిలో ఘటన

అమరావతి,చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యం వల్లే తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందారని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఘోర ప్రమాదం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఘటనలో ఆరుగురు చనిపోవడం బాధాకరమని అన్నారు. తక్షణమే విచారణ జరిపి బాధ్యులు ఏ స్థాయిలో ఉన్నా వారిపై చర్యలు తీసుకుంటేనే మరణించిన వారి ఆత్మలు శాంతిస్తాయని పేర్కొన్నారు. తిరుమల కొండపై వివాదాలు సృష్టించి, రాజకీయంగా వైసీపీని అణచివేసేందుకు టీటీడీ చైర్మన్, ఈవో, జేఈవో ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. వీరికి భక్తులకు సేవ చేయాలనే దృక్పథం లేదని విమర్శించారు. వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై కిందిస్థాయి సిబ్బంది సూచనలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. అధికారుల తప్పిదం, మానవ లోపంతోనే తొక్కిసలాట జరిగిందని ఆరోపించారు. చైర్మన్ బీఆర్ నాయుడికి దేవుడి మీద భక్తి లేదని,



వైసీపీ మీద పూర్తిగా విషం చిమ్మటమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. కొండ మీద రాజకీయాలు చేసి జగన్‌ను అడ్డుకునే ప్రయత్నాలే చేశారని

## ఆర్ బి ఇండస్ట్రియల్ జిన్నింగ్ మిల్‌లో భారీ అగ్ని ప్రమాదం

కుమ్రం భీం ఆసిఫాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం ఇందానీ ఎక్స్ రోడ్ వద్ద గల ఆర్ బి ఇండస్ట్రియల్ జిన్నింగ్ మిల్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పత్తి లోడుతో వచ్చిన వాహననికి ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని వాహనంలోని పత్తితో పాటు మిల్లులో ఉన్న పత్తి దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com